## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తాంసి, జూన్ 25: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావ్యవాణి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగతంగా శుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు రాకుండా నీరు నిల్వ చేయవద్దని తెలిపారు. ఇంట్లోకి దోమలు రాకుండా దోమ తెరలు వాడాలని సూచించారు.

## నేడు భీంపూర్ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

తాంసి(భీంపూర్), జూన్ 25 : భీంపూర్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్ కృష్ణరత్న ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం తాంసిలో ఉదయం 11.30 గంగలకు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ఉట్నూర్ రూరల్, జూన్ 25 : హస్నాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అజయ్ పవార్ మంగళవారం విద్యార్థులకు ప్లేట్లు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూలై 2 వరకు దోస్త్ అడ్మిషన్లు

భైంసా, జూన్ 25 : దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ జూలై 2వ తేదీ వరకు కొనసాగుతుందని దోస్త్ కోఆర్డినేటర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ ద్వారా డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు విధిగా సమర్పించాల్సి ఉంటుంది, ఇది తెలియక అనేక మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందుపరచక సీటును కోల్పోతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావున విద్యార్థులు దోస్త్ రిజిస్ట్రేషన్ సమయంలో ఇన్‌కమ్ సర్టిఫికెట్‌ను పొందుపరిస్తే తాము కోరుకున్న కళాశాలలో సీటు పొందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

## సాకెరలో గ్రామసభ

సోన్, జూన్ 25: సోన్ మండలం సాకెర గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి జ్యోతి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలు, ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేసుకుందామని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో కలీం, పంచాయతీ కార్యదర్శి ప్రియాంకరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

కుంటాల, జూన్ 25: కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అప్క గజ్జారాం అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎంఏ అబ్దుల్ రహీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

దిలావర్‌పూర్, జూన్ 25 : విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు చక్కని భోజనం అందించాలని ఎంఈవో కస్తూరి శంకర్ అన్నారు. మంగళవారం గుండంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అంతకుముందు పాఠశాలలోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారా లేదా వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని కోరారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


యువ నాయకులను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి(తలమడుగు), జూన్ 25 : తలమడుగు మండలం కజ్జర్ల బీఆర్ఎస్ నాయకులు మద్దెల రాజు, అభిరాం జన్మదిన వేడుకలను జడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. మంగళవారం జన్మదిన వేడుకల్లో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొని యువ నాయకులను శాలువాతో సన్మానించి కేకులు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్ట కిరణ్ కుమార్, నాయకులు గంగాధర్, ప్రకాశ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రమాకాంత్, ప్రశాంత్, తిరుమల్ గౌడ్, పాండురంగ్, చందు, శ్రీను, వెంకటేశ్ పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

తాంసి(తలమడుగు)/ఇంద్రవెల్లి. జూన్ 25 : రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయడంపై తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో, ఇంద్రవెల్లిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తలమడుగు జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మీరాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రకాశ్‌రావ్, భూమారెడ్డి, ఎంపీటీసీలు రమేశ్ రెడ్డి, కమలాకర్, వెంకన్న యాదవ్, కోఆప్షన్ సభ్యులు బాబు ఖాన్, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ ఇంద్రవెల్లి మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మాజీ మండలాధ్యక్షుడు నాగోరావ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, పట్టణ అధ్యక్షుడు జహీర్, ఎస్సీ సెల్ మండల నాయకుడు సోన్‌కాంబ్లే జితేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి


మాట్లాడుతున్న వెంకట్రావు

ఉట్నూర్, జూన్ 25: ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉట్నూర్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేడ్‌వన్ ఉపాధ్యాయులకు జోనల్ పోస్టుల ప్రమోషన్ భర్తీ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. గిరిజన బాలికల పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను వార్డెన్లుగా నియమించాలని, ప్రతి టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్ నాయక్, ఉపాధ్యాయులు మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఇష్టం మేరకే భరోసా

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతు వేదికల్లో రైతుల అభిప్రాయ సేకరణ


జైనథ్ : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

ఇంద్రవెల్లి, జూన్ 25: రైతుల అభీష్టం మేరకే ప్రభుత్వం రైతు భరోసాను అందజేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేతలు, ఆదర్శ రైతులచే అవగాహన కల్పించారు. వ్యవసాయం, రైతు సంక్షేమంతో పాటు రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. రైతు నేస్తం వీడియో కన్ఫరెన్స్ అందుబాటులో ఉన్న ఏడీఏ స్థాయి అధికారితో ఇంద్రవెల్లిలోని బుద్ధనగర్‌కు చెందిన సోన్‌కాంబ్లే గోపినాథ్‌ను మాట్లాడించడం జరిగింది. 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు రైతు భరోసా అమలు చేయాలని, వ్యవసాయ రంగంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి వారికి రైతు భరోసా పథకాన్ని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేశ్, ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి ఎంఏవోలు గణేశ్, అరుణ, దివ్య, ఏఈవోలు మల్లేశ్, వీర, వివేక్, నవతేజ్, కరుణ పాల్గొన్నారు.

### జైనథ్‌లో..

జైనథ్, జూన్ 25 : జైనథ్‌లోని రైతు వేదికలో జైనథ్, బేల, ఆదిలాబాద్, మావల మండల రైతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా పథకంపై రైతులు తమ అభిప్రాయాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఏవో వివేక్, బేల, బోథ్, ఏవో విశ్వామిత్ర, ఆదిలాబాద్ ఏవో సంధ్య, అశ్రఫ్‌తో పాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### సకాలంలో రైతు భరోసా అందించాలి

కుంటాల, జూన్ 25 : రైతు భరోసా కింద అందించే సాయం 10 ఎకరాల వరకు ఇవ్వాలని, సమయానికి అందించాలని రైతులు కోరారు. కుంటాలలోని రైతు వేదికలో కుభీర్, భైంసా, కుంటాల మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులతో పాటు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. 10 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా సాయాన్ని అందించాలని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వీసీలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వ్యవసాయ సలహా సంఘం సభ్యుడు కోదండ రెడ్డి, డీఈవో అంజిప్రసాద్, కుంటాల ఏవో సోమలింగా రెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

### కడెంలో..

కడెం, జూన్ 24 : కడెంలోని రైతు వేదికలో కడెం, దస్తురాబాద్, ఖానాపూర్, పెంబి మండలాలకు చెందిన రైతులు, ఆయా క్లస్టర్ల పరిధిలోని అధికారులతో రైతు భరోసాపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్యాక్స్ చెల్లించే వారికి రైతు భరోసా కింద అందించే సాయం ఇవ్వకూడదని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### సారంగాపూర్‌లో..

సారంగాపూర్, జూన్ 25 : మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించారు. సారంగాపూర్, మల్లక్‌చించోలి గ్రామాలకు చెందిన గోవింద్‌రెడ్డి, నామాల రమేశ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 10 ఎకరాలలోపు ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని, వానకాలం పంటకు జూన్‌లో, యాసంగి పంటకు సెప్టెంబర్‌లో రెండు సార్లు సకాలంలో రైతులకు అందించాలని మంత్రికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ వినయ్‌బాబు, ఏవో రాజశేఖర్‌రెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

### బోథ్‌లో..

బోథ్, జూన్ 25: రైతు భరోసా పథకంపై బోథ్‌లోని రైతు వేదికలోవీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్ మండలాల పరిధిలోని రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీధర్‌స్వామి, ఏవోలు రమేశ్, ప్రమోద్‌రెడ్డి, భాస్కర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

### ఇచ్చోడ మండల కేంద్రంలో..

ఇచ్చోడ, జూన్ 25 : ఇచ్చోడలోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో గుడిహత్నూర్, సిరికొండ, ఇచ్చోడ మండలాల రైతులు పాల్గొన్నారు. రైతు భరోసా పథకంపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాంకిషన్, ఏవోలు జాదవ్ కైలాస్, రవీందర్, డీ రేణుక, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.


సారంగాపూర్ : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

# లబ్ధిదారులు దళారులను నమ్మవద్దు


ఎదులాపురం: చెక్కులు పంపిణీ చేస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, జూన్ 25 : సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మవద్దని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. మంగళవారం ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ పట్టణం, రూరల్, మావలకు చెందిన 302 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్లు , నాయకులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలి

జైనథ్(బేల), జూన్ 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై రానున్న అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావిస్తానని పేర్కొన్నారు. మంగళవారం బేలలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బేల జడ్పీటీసీ అక్షిత పవార్, ఎంపీపీ వనితా ఠాక్రే, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### ఎంపీడీవో కార్యాలయంలో..

జైనథ్, జూన్ 25 : ఎన్నికల కోడ్ కారణంగా లబ్ధిదారులకు చెక్కులు అందించడంలో ఆలస్యమైందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఆర్ఐలు నితిన్‌కుమార్, విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గుడిహత్నూర్, జూన్25 : గుడిహత్నూర్ మాజీ సర్పంచ్ జాదవ్ సునీత మాతృమూర్తి శాంతాబాయి మృతి చెందారు. మంగళవారం మండలంలోని కొల్హారి గ్రామంలో పార్థివదేహం వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో కుక్కల దాడి

నిర్మల్ అర్బన్, జూన్ 25 : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి సోమవారం రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పట్టణంలో నిత్యం ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తులు


బోథ్‌లో దరఖాస్తులు సమర్పిస్తున్న లబ్ధిదారులు

బోథ్, జూన్ 25: గృహజ్యోతి పథకం వర్తించని పలు గ్రామాల ప్రజలు మళ్లీ దరఖాస్తులు అందించేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వస్తున్నారు. దరఖాస్తులు నింపడంలో తప్పులు దొర్లిన వారికి కరెంట్ బిల్లులు మాఫీ, వంటగ్యాస్‌లో రాయితీ వర్తించడం లేదు. మంగళవారం వివిధ గ్రామాల నుంచి వచ్చి దరఖాస్తు చేసుకున్నారు.

## వ్యాధుల బారిన పడకుండా చర్యలు

ఖానాపూర్,జూన్25 : వానకాలం దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ రాజుర సత్యం అన్నారు. పట్టణంలోని 12 వ వార్డు సుభాష్ నగర్‌లో కొద్ది రోజుల నుంచి ఏర్పడిన డ్రైనేజీ సమస్యను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసీబీ సహాయంతో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు డ్రైనేజీలోకి మళ్లించినట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ షబ్బీర్ పాషా, వార్డు స్పెషల్ ఆఫీసర్ సంతోష్, సిబ్బంది, కాలనీ వాసులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నిర్మల్ అర్బన్, జూన్ 25 : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చిందని ఇందూర్ విభాగ్ కన్వీనర్ శివకుమార్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల అధిక ఫీజులను అరికట్టి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేశ్, గణేశ్, లక్ష్మణ్, మహేశ్ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే


108 వాహన సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్(బేల), జూన్ 25 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని దవాఖానకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం బేలకు వెళ్తుండగా జైనథ్ సమీపంలో ఓ వ్యక్తి రోడ్డుపై పడి ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి స్వయంగా 108 వాహన సిబ్బందికి ఫోన్ చేసి బాధితుడిని అంబులెన్స్‌లో ఎక్కించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

# చిన్నారికుంట ఆరాధ్య జయంతి


పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైద్యులు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 25 : నిర్మల్‌లోని డా. కావేరి కుటీరంలో మంగళవారం చిన్నారి కుంట ఆరాధ్య 10వ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆరాధ్య తల్లిదండ్రులు డా. కుంట రమణేశ్వర్, స్రవంతి దంపతులు జిల్లాలోని 12 మంది పేద విద్యార్థులను గుర్తించి వారికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. అప్పాల చక్రధారి మాట్లాడుతూ చిన్నారి ఆరాధ్య జయంతి సందర్భంగా ఆరేళ్లుగా పేదలకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. వైద్య వృత్తిలో రాణిస్తూ సామాజిక నిబద్ధతతో వారు సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డా. తుమ్మల దేవరావు, కామారపు జగదీశ్వర్, డా. రామకృష్ణ, కుంట భూమన్న, డా. ప్రశాంత్, అప్పాల మహేశ్, అప్పాల ప్రభాకర్, అప్పాల శశికళ, మైస అరవింద్, పోలీస్ భీమేశ్, పీ దీపక్ పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై దృష్టి సారించాలి

తానూర్, జూన్ 25 : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండలాభివృద్ధి అధికారి అబ్దుల్ సమద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలని, హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వానకాలంలో వ్యాధులు రాకుండా నీరు నిల్వ ఉండకుండా చుడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో గంగాధర్, మండల కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

# వైకుంఠధామం పనులు త్వరలోనే పూర్తి చేస్తాం

నిర్మల్ అర్బన్, జూన్ 25 : నిర్మల్‌లోని శివాజీ చౌక్ వద్ద గల వైకుంఠధామంలో మిగిలి ఉన్న పనులు త్వరలోనే పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి వైకుంఠధామం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.20 లక్షల పనులు మిగిలి ఉన్నాయన్నారు. పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల హంగులతో మోడల్ వైకుంఠధామంగా అందుబాటులోకి రానుందని అన్నారు. కార్యక్రమంలో వైకుంఠధామం అధ్యక్షుడు అయ్యన్నగారి రాజేందర్, కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, ఎస్పీ రాజు, నాయకులు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరి మృతి

నేరడిగొండ, జూన్ 24 : నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గడ్‌చాంద పెద్ద సాయన్న(48), చుంచు సురేశ్(31) మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం, పార్‌పెల్లి గ్రామానికి చెందిన గడ్‌చాంద పెద్ద సాయన్న, నేరడిగొండకు చెందిన చుంచు సురేశ్ బైక్‌పై రాత్రి నేరడిగొండ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొన్నారు. తీవ్రగాయాలతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు బోథ్ దవాఖానకు తరలించారు. మంగళవారం పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బస్సు ప్రమాదంలో జిల్లా వాసి మృతి

ఎదులాపురం, జూన్ 25 : ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డైమాండ్ ట్రావెల్ బస్సు మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళ్తే కామారెడ్డి మండలం క్యాసంపల్లి జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డైమాండ్ ట్రావెల్స్ బస్ ముందున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆదిలాబాద్‌లోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన అప్సర్ (27) మృతి చెందాడు. ఇందులో ప్రయాణిస్తున్న 28 మంది ప్రయాణికులకు గాయాలు కాగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

## నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిస్తే చీటింగ్ కేసు


నంబర్ ప్లేట్‌లేని వాహనాలను సీజ్ చేసిన సీఐ ప్రణయ్‌కుమార్

ఎదులాపురం, జూన్ 25 : నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిస్తే చీటింగ్ కేసు నమోదు చేస్తామని ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నంబర్‌ప్లేట్ లేని 52 వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టడం జరిగిందన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవ్‌లో ఎస్ఐ మోబిన్, ఏఎస్ఐ ఉత్తమ్, సిబ్బంది ఉన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

ఇంద్రవెల్లి, జూన్ 25: సైబర్ నేరాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ భీంరావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ భీంరావ్ మాట్లాడుతూ బ్యాంకులకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియని వ్యక్తులకు అందించవద్దని అన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ఆర్థికంగా మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న కమలానంద భారతీ స్వామి


అమ్మవారిని దర్శించుకుంటున్న కమలానంద భారతీ స్వామి

బాసర, జూన్ 23 : బాసర పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో మంగళవారం చిదానంద ఆశ్రమ భువనేశ్వరి పీఠాధిపతి విజయవాడ శ్రీశ్రీశ్రీ కమలానంద భారతీ స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి గర్భగుడిలో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయాధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి గర్భగుడిలో లడ్డు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పెంబి అవృద్ధికి కృషి చేస్తా


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

పెంబి, జూన్ 25: పెంబి మండలాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మందపల్లి గ్రామంలో మందపల్లి – చందునాయక్‌తండా గ్రామం వరకు రూ.18 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, రెండు హైలెవల్ వంతెనల నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్ కుమార్, డీఈ మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ వాడకంతో కలిగే నష్టాలపై క్లాసులు నిర్వహించాలి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న మానవహక్కుల వేదిక నాయకులు

ఇంద్రవెల్లి, జూన్ 25: సెల్‌ఫోన్ వాడకంతో చిన్న పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని, పాఠశాలల్లో దీనిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపర్చాలని కోరుతూ మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతిశ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లో జిల్లా విద్యాధికారి ప్రణీతను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. సెల్‌ఫోన్ వాడకంతో జరిగే నష్టాలపై డెమో క్లాసులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీకాంత్‌నాయక్, ఎస్సీ, ఎస్టీ డివిజన్ స్థాయి సభ్యుడు సూరజ్, జిల్లా సామాజిక నాయకులు విశాల్‌పరత్వాగ్ ఉన్నారు.